కాకినాడ ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35 (గురువారం)
కనిష్ఠం : 26



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు దంపతులు

6

మురమళ్లకు బ్రహ్మోత్సవ శోభ



ఆలయంలో స్వామి,అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

ఘనంగా మేడే

జిల్లావ్యాప్తంగా మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా మండలాల్లో కార్మికులు ర్యాలీలు చేపట్టగా పలుచోట్ల జెండాలు ఆవిష్కరించారు.



జగ్గంపేటలో మేడే సందర్భంగా ప్రదర్శన నిర్వహిస్తున్న అరుణోదయ కళాకారులు



కాకినాడలో మినీ గూడ్స్ ఆటో సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వనమాడి



పెద్దాపురంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మే డే సందర్భంగా చేపట్టిన ప్రదర్శన

ఆశలు.. గల్లాన్!



డీసీసీబీ పీఠం జనసేనదే..

- ఇంతకాలం టీడీపీకేనని నిర్ణయం
- చివర్లో అనూహ్య మార్పు
- పశ్చిమ డీసీసీబీ టీడీపీ..
- తూర్పు జనసేనకు పంపకాలు
- రెండ్రోజుల్లో అధికారిక ప్రకటన
- పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డికి ఛాన్స్!
- నిరాశలో టీడీపీ ఆశావహులు
- కోనసీమకు డీసీఎంఎస్ చైర్మన్
- ఇద్దరు టీడీపీ నేతల పరిశీలన

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ పదవీ పంపకం ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. ఆఖర్లో అనూహ్యంగా ఈ కీలక పదవిని జనసేన ఎగరేసుకుపోయింది.ఈ కుర్చీ టీడీపీ తీసుకోవాలని తొలుత నిర్ణయం జరగ్గా ఆఖరి నిమిషంలో సమీకరణాలన్నీ మారిపోయాయి. టీడీపీకి బదులు జనసేనకు డీసీసీబీ ఇచ్చేయాలని నిర్ణయం జరిగింది. పశ్చిమ డీసీసీబీ టీడీపీ, తూర్పుగోదావరి డీసీసీబీ జనసేన తీసుకునేలా ఎట్టకేలకు నిర్ణయించారు. జనసేన నుంచి పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డికి పదవి దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.అటు చైర్మన్ కుర్చీ టీడీపీదేనని ఇంతకాలం భావించిన ఆశావహులు తీవ్ర నైరాశ్యంలో కూరుకుపోయారు. ఎమ్మెల్యేల వద్ద నిట్టూర్చుతున్నారు. కాగా డీసీఎంఎస్ చైర్మన్ పదవికి కోనసీమ జిల్లాకు చెందిన ఇద్దరు టీడీపీ నేతల పేర్లు పరిశీలనలో ఉన్నాయి.

ఆఖర్లో అనూహ్యంగా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ కుర్చీ అంటే అదో హోదా. రాష్ట్రంలో అతిపెద్ద డీసీసీబీ తూర్పుగోదావరిదే. కూటమి అధికారంలోకి రావడంతో ఈ పదవి దక్కించుకోవాలని మూడు నెలలుగా అనేక మంది టీడీపీ నేతలు పావులు కదిపారు. ఉభయగోదావరి జిల్లాల నేతలు అధిష్ఠానం వద్ద పంచాయతీ పెట్టి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ కుర్చీ జనసేనకు..తూర్పుగోదావరి టీడీపీకి ఇచ్చేలా కొంత కాలం కిందట నిర్ణయించారు. దీంతో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు టీడీపీ ఆశావహులు తమ ప్రయత్నాలు ఆరంభించారు. ప్రధానంగా జడ్పీ చైర్మన్‌గా గతంలో పనిచేసిన జ్యోతుల నవీన్‌కు అవకాశం వస్తుందని ప్రచారం జరిగింది. కాకినాడ రూరల్ కోఆర్డినేటర్ బాబి అయితే తనకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ టికెట్ రానందున డీసీసీబీ అయినా సాధించుకోవాలని మంత్రులు, ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి వారి నుంచి లేఖలు సేకరించారు. కోనసీమ నుంచి మెట్ల రమణబాబు, మెట్ల నుంచి తోట నవీన్ తదితరులు ఆశలు పెంచుకున్నారు. ఇటీవల సీఎం చంద్రబాబు డీసీసీబీ నామినేటెడ్ చైర్మన్ పోస్టులు ప్రకటించినప్పుడు ఆ జాబితాలో రెండు ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల చైర్మన్ల ప్రకటన వాయిదా పడింది. తీరా పశ్చిమ డీసీసీబీ జనసేనకు బదులు టీడీపీకి ఇవ్వాలనే ఒత్తిడి పెరగడంతో సమీకరణలు మార్చాల్సి వచ్చి ఉమ్మడి తూర్పు చైర్మన్ పేరు వాయిదా వేశారు. మూడు రోజులుగా ఈ రెండు జిల్లాలకు సంబంధించిన టీడీపీ నేతలతో పార్టీ పెద్దలు అమరావతిలో చర్చలు జరిపారు. పశ్చిమ డీసీసీబీ కుర్చీ టీడీపీ తీసుకుని ఉమ్మడి తూర్పు కుర్చీని జనసేనకు కేటాయించాలని తీర్మానించారు.అనేక తర్జనభర్జనల తర్వాత ఉమ్మడి తూర్పుగోదావరి డీసీ సీబీ చైర్మన్ కుర్చీ జనసేనకు ఇచ్చేయాలని టీడీపీ నిర్ణయించింది. కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు ఈసారికి డీసీసీబీ ఉమ్మడి జిల్లాలో టీడీపీకి ఇచ్చేలా అధిష్ఠానాన్ని ఒప్పించే ప్రయత్నం చేసినా ఫలించలేదు. తాజా నిర్ణయంపై టీడీపీలో కొందరు ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు కొంత అసహనం వ్యక్తం చేస్తున్నారు.అధిష్ఠానం వద్ద ఒకరిద్దరు ఎమ్మెల్యేలు ఇదే ఏకరువు పెట్టినా పొత్తు ధర్మం పాటించాల్సిందేనని అధిష్ఠానం తెగేసి చెప్పింది. ఆశావహులు తమకు అన్యా యం జరిగిందంటూ ఎమ్మెల్యేల వద్ద నిట్టూర్చుతున్నారు.

డీసీఎంఎస్ చైర్మన్ ఎవరో..

డీసీసీబీ చైర్మన్ కుర్చీ జనసేనకు ఇచ్చేసిన నేపథ్యంలో డీసీఎంఎస్ చైర్మన్ పదవిని టీడీపీ తీసుకోవాల్సి ఉంది. దీంతో ఈ పదవికి టీడీపీ నుంచి ఎవరిని ఎంపిక చేస్తారనేది ఆసక్తిగా మారింది. వాస్తవానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో డీసీసీబీ చైర్మన్ జనసేన, డీసీఎంఎస్ చైర్మన్ టీడీపీ తీసుకోవాలనే నిర్ణయం జరగడంతో ఉమ్మడి తూర్పులో డీసీసీబీ చైర్మన్ టీడీపీ, డీసీఎంఎస్ చైర్మన్ జనసేన నుంచి ఎంపిక చేయాల్సి ఉంది. కానీ ఆఖర్లో అన్నీ మారడంతో ఇప్పుడు టీడీపీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్‌ను ఎంపిక చేయాల్సి ఉంది.దీంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఇద్దరు పార్టీ సీనియర్ నేతల పేర్లను అధిష్ఠానం పరిశీలిస్తోంది.వీరిలో పెచ్చెట్టి చంద్రమౌళి,పెచ్చెట్టి విజయలక్ష్మి ఉన్నట్టు తెలిసింది.చంద్రమౌళి పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాగా,విజయలక్ష్మి కోనసీమ జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలిగా ఉన్నారు.డీసీసీబీ చైర్మన్,డీసీఎంఎస్ చైర్మన్ పేర్లను రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

ఆ కుర్చీ ఆయనకేనా..

డీసీసీబీ చైర్మన్‌గా పిఠాపురం ఇన్ చార్జి మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి పేరు దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. పవన్‌కల్యాణ్ పిఠాపురం నుంచి పోటీ చేస్తారని ఎన్నికల ముందు ప్రకటించినప్పటి నుంచి మర్రెడ్డి పార్టీలో క్రియా శీలకంగా పనిచేస్తున్నారు. అంతకుముందు అనపర్తి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ఈయన్ను పిఠాపురం తీసుకువచ్చారు.అప్పటి నుంచీ ఇప్పటి వరకు పిఠాపురం జనసేన పిఠాపురం ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు.ఈ నేపథ్యంలో ఈయనకు పదవి ఇవ్వాలని నిర్ణయం జరిగినట్టు తెలిసింది. మరోపక్క మర్రెడ్డి తర్వాత పార్టీలో చేరిన తోట సుధీర్‌కు ఇప్పటికే పౌర సరఫరాల సంస్థ చైర్మన్, జిల్లా పార్టీ అధ్యక్షుడు తుమ్మలబాబుకు కుడా చైర్మన్ పదవి ఇచ్చారు. పార్టీ కోసం పనిచేసిన వేముల పాటి అజయ్‌కు టిడ్కో చైర్మన్, హరిప్రసాద్‌కు ఎమ్మెల్సీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లా తరపున మర్రెడ్డి పేరు తర్వాత లిస్టులో ఉండడంతో ఇప్పుడు ఈయనకు డీసీసీబీ పదవి కట్టబెట్టాలని పార్టీ యోచిస్తోంది.కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన బండారు శ్రీనివాస్ పేరు ప్రచారంలోకి వస్తున్నా మర్రెడ్డి వైపే మొగ్గుచూపుతున్నట్టు తెలిసింది.మర్రెడ్డిని డీసీసీబీ చైర్మన్‌గా పంపి ఎమ్మెల్సీ నాగబాబును పిఠాపురం ఇన్‌చా ర్జిగా నియమిస్తారనే చర్చ జనసేనలో జరుగుతోంది.

రహదారులు.. బాగు..బాగు!



బీటీ రోడ్డుగా చెందుర్తి-తాటిపర్తి రహదారి

పంచాయతీరాజ్ రహదారులకు మోక్షం

- ఉమ్మడి జిల్లాలో 29 రోడ్ల అభివృద్ధి
- రూ.73.15 కోట్లు విడుదల
- ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల
- టెండర్లు పిలవాలని ఆదేశం
- 9 నెలలే నిర్మాణ గడువు
- నాబార్డు-ఆర్ఐడీఎఫ్ రుణం
- ప్రభుత్వ వాటా నిధులు విడుదల

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

ప్రభుత్వం మారింది..రోడ్లకు మహర్దశ పట్టింది.. గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్డెక్కితేనే నరక యాతన.. ప్రస్తుతం ఎక్కడికక్కడ రహదారులు వేస్తున్నారు.. దీంతో ప్రయాణం సాఫీగా సాగిపోతోంది. ఇదిలా ఉండగా పంచాయతీరాజ్ రహదారులకు మోక్షం లభించింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీస నిర్వహణకు నోచుకోని రోడ్ల అభివృద్ధికి పుష్కలంగా నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాబార్డు-ఆర్ఐడీఎఫ్ రుణం, ప్రభుత్వ వాటాతో కలిపి ఉమ్మడి జిల్లాలో 29 రహదారులకు రూ.73.15 కోట్లు విడుదల చేశారు. ఈ నిధులతో తక్షణం పనులు ప్రారంభించేందుకు వీలుగా టెండర్లు పిలవాలని ప్రభుత్వం ఆదేశించింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్‌శాఖ అధీనంలో ఉన్న గ్రామీణ ప్రాంత రహదారులను బీటీ రోడ్లుగా అభివృద్ధి చేయాలని సంకల్పించారు. ప్రస్తుతం ఉన్న బీటీ రోడ్ల అభివృద్ధితో పాటు గ్రావెల్, మెటల్ రోడ్ల స్థానంలో బీటీ రోడ్లు వేసేందుకు ప్రాధాన్యమిస్తూ నిధులు కేటాయించారు.

నాబార్డు దారిచూపుతోంది..

గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి నాబార్డు ప్రతి ఏటా రుణం మంజూరు చేస్తుంది. దీనికి ప్రభుత్వం 33 శాతం వాటా నిధులను సమకూర్చాల్సి ఉంటుంది.రుణంతో పాటు ప్రభుత్వం నిధులు కలిపి రోడ్ల అభివృద్ధికి కేటాయిస్తుంది. ఈ పథకం ద్వారా పనులు చేపట్టేందుకు అవసరమైన నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం ముందుకు రావడంతో నాబార్డు రుణాన్ని మంజూరు చేసింది. ఆర్థిక సంవత్సరం మొదలైన నెల వ్యవధిలో ఈ నిధులతో చేపట్టే పనులకు ప్రభుత్వం అనుమతులిస్తూ జీవో జారీ చేసింది. తక్షణం టెండర్లు పిలిచి ఆరు నుంచి తొమ్మిది నెలల వ్యవధిలో పనులు పూర్తి చేయాలని ఆదేశించింది.వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధికి నాబార్డు-ఆర్ఐడీఎఫ్ కింద రుణం మంజూరు చేసినా రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను విడుదల చేయకపోవడం, విడుదల చేస్తామని నాబార్డు రుణాన్ని తీసుకుని ఇతర పథకాలకు మళ్లించడం చేసింది.దీంతో ఐదేళ్ల కాలంలో ఒక పనిని పూర్తి చేయలేకపోయారు.

కాకినాడ జిల్లాలో..

జిల్లాలో 14 పీఆర్‌రహదారులకు రూ.28.10 కోట్లు కేటాయించారు.జగ్గంపేట నియోజకవర్గం మామిడాడ-అప్పన్నపాలెం రహదారికి రూ.1.20 కోట్లు, కాకినాడరూరల్‌లో కేఎస్ఎఫ్ రోడ్డు-యండమూరు -సిరిపురం-అడ్డతూము రోడ్డుకు రూ.2 కోట్లు, వేళంగి-సిరిపురం -తాటిపల్లి జంక్షన్ రోడ్డుకు రూ.1.70 కోట్లు, పెద్దాపురం అసెంబ్లీ ఆర్‌బీ కొత్తూరు-చేట్లపాలెం రోడ్డుకు రూ.1.80 కోట్లు, పులిమేరు-చిరవ రోడ్డుకు రూ.1.65 కోట్లు, పిఠాపురం అసెంబ్లీ చెందుర్తి-తాటిపర్తి రోడ్డుకు రూ.1.80 కోట్లు, ఏకే మల్లవరం-ఉప్పరగూడెం రోడ్డుకు రూ.4 కోట్లు, ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి కందరాడ వరకు రూ.55 లక్షలు,పిఠాపురం-సామర్లకోట రోడ్డు-గోవిందరాజులపాలెం- మల్లాం రోడ్డుకు రూ.1.40 కోట్లు,వెల్దుర్తి-ధర్మవరం రోడ్డు నుంచి పి.దొంతమూరు-పి.రాయవరం వరకు రూ.2 కోట్లు,నాగులాపల్లి-సీతానగరం-చేబ్రోలు రోడ్డుకు రూ.1.20 కోట్లు,ప్రత్తిపాడు అసెంబ్లీ లింగంపర్తి-కొండతిమ్మాపురం రోడ్డు రూ.3 కోట్లు,రామచంద్రపురం అసెంబ్లీ కాకినాడ-కోటిపల్లి రోడ్డు నుంచి శలపాకకు రూ.2.80 కోట్లు, తుని అసెంబ్లీ కృష్ణాపురం నుంచి యల్లయ్యపేటరోడ్డుకు రూ.3 కోట్లు మంజూరయ్యాయి.

తూర్పుగోదావరి జిల్లాలో..

తూర్పుగోదావరి జిల్లాలో 13 రహదారుల అభివృద్ధికి రూ.24.62 కోట్లు కేటాయించారు. అనపర్తి నియోజకవర్గం దుప్పలపూడి నుంచి కాపవరం రోడ్డుకు రూ.2 కోట్లు, మర్రిపూడి నుంచి ఆర్‌బీపట్నం రోడ్డుకు రూ.1.20 కోట్లు, గోపాలపురం నియోజకవర్గంలో కరిచర్లగూడెం నుంచి సంజీవపురం రోడ్డుకు రూ.1.50 కోట్లు, చోడవరం-గుండేపల్లి రోడ్డుకు రూ.1.80 కోట్లు, జగ్గంపేట నియోజకవర్గంలో గోకవరం-ఆర్.ఎ గ్రంపాలెం రోడ్డుకు రూ.1.50 కోట్లు, కొవ్వూరు నియోజకవర్గంలో పెనకనపెట్ట-కుమారదేవం రోడ్డుకు రూ.2.70 కోట్లు, నిడదవోలు నియోజకవర్గంలో సింగవరం-నందమూరు రోడ్డుకు రూ.1.47 కోట్లు, కానూరు-నడుపల్లికోట రోడ్డుకు రూ.1.50 కోట్లు, ఎన్‌హెచ్-16-కొత్తపల్లి అగ్రహారం-కాపవరం రోడ్డుకు రూ.1.70 కోట్లు, పైడిపర్రు-సత్యవాడ రోడ్డుకు రూ.2.70 కోట్లు, రాజమహేంద్రవరం రూరల్‌లో జేగురుపాడు బ్రిడ్జి-కడియపుసావరం-కడియం బ్రిడ్జి రోడ్డుకు రూ.2.60 కోట్లు, కాతేరు నుంచి బాతింగ్ ఘాట్ వరకు రూ.60 లక్షలు, రాజానగరం నియోజకవర్గం సీతానగరం నుంచి పురుషోత్తపట్నం వరకు రోడ్డుకు రూ.3.25 కోట్లు కేటాయించారు.

కోనసీమ జిల్లాలో..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 12 రహదారులకు రూ.20.43 కోట్లు కేటాయించారు. అమలాపురం అసెంబ్లీ సిరిపల్లి-మునిపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు-ఉప్పలగుప్తం-పేరయ్యచెరువు రోడ్డుకు రూ.3 కోట్లు, కొత్తపేట అసెంబ్లీ అమలాపురం-రావులపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డు మోడేకుర్రు వరకు రూ.1.45 కోట్లు, మడికి-చిలకలపాడుకు రూ.1.14 కోట్లు, మండపేట అసెంబ్లీ ఆర్‌సీపురం-నదురుబాద- పీవీ రోడ్డుకు రూ.3.30 కోట్లు, ముమ్మిడివరం అసెంబ్లీ ఐ.పోలవరం-కేశనకుర్రు రోడ్డుకు రూ.1.95 కోట్లు,ముమ్మిడివరం-కొత్తలంక రోడ్డు నుంచి పచ్చిమట్లవారిపాలెం వరకు రూ.1.32 కోట్లు, పి.గన్నవరం అసెంబ్లీ నల్లచెరువు-పెండాల్యచెరువు రోడ్డుకు రూ.65 లక్షలు, అవిడి-మాచవరం టూ ఇసుకపూడి వరకు రూ.1.25 కోట్లు, అమలాపురం బొబ్బర్లంక,గన్నవరం ఆర్‌అండ్‌బీ రోడ్ల మధ్య వయా కొర్లపాటివారిపాలెం రోడ్డుకు 1.10 కోట్లు,రామచంద్రపురం అసెంబ్లీ ద్రాక్షారామ-ఆదివారపుపేట-వెల్ల రోడ్డుకు రూ.2.72 కోట్లు, రాజోలు అసెంబ్లీ గొల్లపాలెం బ్రిడ్జి నుంచి కాట్రేనిపాడు రోడ్డు వరకు రూ.1.27 కోట్లు, పొన్నమండ-కాట్రేనిపాడు రోడ్డుకు రూ.1.28 కోట్లు నిధులు కేటాయించారు.

ముగ్గురికి నియామక ఉత్తర్వులు అందజేత

కలెక్టరేట్(కాకినాడ), మే1(ఆంధ్రజ్యోతి): 2022-23వ ఆర్థిక సంవత్సరం విభిన్న ప్రతిభావంతుల బ్యాక్లాగ్ నియామకప్రక్రియలో భాగంలో గుర్తించిన పోస్టులకుగాను ముగ్గురు బధిర విభిన్న ప్రతిభావంతులకు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌షాన్‌మోహన్ నియామక ఉత్తర్వులు అందజేశారు.

ఇకపై జీజీహెచ్‌లో ఈ-హాస్పటల్ సేవలు

సూపరింటెండెంట్ ఎంపీఆర్ విఠల్

జీజీహెచ్(కాకినాడ),మే1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో ఈ-హాస్పటల్ (కాగితరహిత) సేవలు అందించేందుకు ప్రయోగాత్మక ప్రక్రియకు ఆవిష్కరణ చేపట్టినట్లు ఆస్పత్రిసూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ-హాస్పటల్ సర్వీసెస్‌ను ప్రారంభించినట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ వైద్యవిధానం ద్వారా రోగికి సంబంధించిన సమాచారం క్లినికల్ మాడ్యూల్‌లో నిక్షిప్తం చేస్తారు. తద్వారా రోగి ఎప్పుడు ఆస్పత్రికి వచ్చినా వ్యాధివివరాలు, అందించినవైద్యం, వాడిన మందులు, రక్తపరీక్షలు తదితర పూర్వపుసమాచారం పొందుపర్చి ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి బుధవారం వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నిర్వహించిన డీఎంఈ సమీక్ష సమావేశం తర్వాత సూపరింటెండెంట్ విఠల్ గురువారం ఆర్థోపెడిక్స్ జనరల్ మెడిసిన్, గైనకాలజీ విభాగాల్లో పర్యటించారు. అన్ని ఓపీ కేసులు క్లినికల్ మాడ్యూల్‌లో తప్పని సరిగా నమోదు చేయాలన్నారు.

అమరావతికి 70 బస్సులు

- ప్రధాని సభకు జిల్లానుంచి 3వేలమంది తరలింపు
- రాజధాని పునఃప్రారంభోత్సవానికి పయనం

కలెక్టరేట్(కాకినాడ),మే1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి పునః ప్రారంభోత్సవానికి కార్యక్రమానికి జిల్లానుంచి 70 బస్సుల్లో 3వేల మంది పయనమవుతున్నారు. అమరావతిలో శుక్రవారం సాయంత్రం ప్రధానమంత్రి మోదీ సమక్షంలో బహిరంగ సభ జరగనుంది. శుక్రవారం మధ్యాహ్నం 3.20గంటలకు ప్రధాని మోదీ అమరావతికి చేరుకుంటారు. ఈ నేపథ్యంలో జిల్లా నుంచి కూటమి పార్టీ నేతల ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతోపాటు జనం బయలుదేరనున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 70బస్సులు అమరావతికి బయలుదేరి సాయంత్రానికి సభాస్థలికి చేరుకుంటాయి. ఒక్కొక్క అసెంబ్లీ నియోజకవర్గానికి పది బస్సులు చొప్పున మొత్తం 70 బస్సులు ఏర్పాటు చేశారు. డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ ఆధ్వర్యంలో బస్సులను ఏర్పాటు చేశారు. శుక్రవారం సభకు బయలుదేరుతున్న వీరికి ఫలహారం, భోజన వసతులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శుక్ర వారం రాత్రి సభ ముగిసిన తర్వాత ఈ బస్సులు తిరిగి పయనమై శనివారం ఉదయానికి కాకినాడ చేరుకుంటాయి.

విజయ స్ఫూర్తితో ఉన్నత లక్ష్యాలను సాధించాలి: కలెక్టర్



పదోతరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులతో కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), మే 1(ఆంధ్రజ్యోతి):పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులతో సాధించిన విజయ స్ఫూర్తిని కొనసాగించి జీవితంలో ఉన్నత లక్ష్యాలను అందుకోవాలని కలెక్టర్ షాన్ మోహన్ స్టేట్, మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలో 600 మార్కులు సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచిన విద్యార్థిని నేహాంజని, మండల టాపర్లుగా నిలిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వారి తల్లిదండ్రులకు గురువారం ప్రత్యేక అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాల్లో పదోతరగతి పరీక్ష ముఖ్యమైన తొలి అంకమన్నారు. చిన్నప్పుడు టెన్త్ పరీక్షలో తాను జిల్లా టాపర్‌గా నిలిచిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. తాము చదువుకోలేకపోయినా పేదరికంలోఉన్నా తమ పిల్లలను ప్రోత్సహించిన తల్లిదండ్రులను ఆయన అభినందించారు. తల్లిదండ్రులను కోల్పోయినా నిబ్బరంతో చదివి టాపర్‌గా నిలిచిన విద్యార్థినికి అండగా నిలుస్తామన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శాలువా కప్పి, రూ.10వేల నగదు, ప్రేరణాత్మక పుస్తకాలను బహుమతిగా అందజేశారు. ట్రైనీకలెక్టర్ మనీషా,డీఈవో రమేష్,డీడీఈవోలు వెంకటేశ్వరరావు, ప్రభాకరశర్మ పాల్గొన్నారు.

మద్యం అక్రమ విక్రయదారుల అరెస్టు

జిల్లావ్యాప్తంగా 167 బాటిళ్ల స్వాధీనం: ఎక్సైజ్ ఏఎస్పీ

కాకినాడ, మే 1(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా బెల్ట్‌షాపుల ద్వారా అక్రమంగా విక్రయాలు జరుపుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారినుంచి మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జయ మౌనిక తెలిపారు. పెదపూడి మండలం చింతలపల్లిలో 22 క్వార్టర్ బాటిళ్లతో చీకట్ల సత్యనారాయణ, పెద్దాపురం మండలం కట్టమూరు దుర్గమ్మ గుడి సమీపంలోని వాటర్ ట్యాంక్‌వద్ద 16 క్వార్టర్ బాటిళ్లతో దుల్ల రాజు, తుని మండలం లోవ కొత్తూరులో మరిడమ్మ గుడివద్ద 20 క్వార్టర్ బాటిళ్లతో బత్తిన లోవరాజు, పిఠాపురం పట్టణం డ్రైవర్స్ కాలనీలో 22 క్వార్టర్ బాటిళ్లతో అల్లంపల్లి సుబ్బారావు, ప్రత్తిపాడు మండలం వెంకటనగరం గ్రామంలో 22 విస్కీ, క్వార్టర్ బాటిళ్లతో పులవర్తి వెంకట మహేశ్వరరావు, కరప మండలం కొరిపల్లివద్ద 16 విస్కీ, ఐదు బ్రాందీ కార్వర్టర్ బాటిళ్లతో పంపన సతీష్‌కుమార్, కాకినాడ అర్బన్‌లోని నరసన్ననగర్‌లో 38 విస్కీ బాటిళ్లు, ఆరు క్వార్టర్ బాటిళ్లతో చీకట్ల సుబ్రహ్మణ్యం అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఏఈఎస్ మౌనిక తెలిపారు.

బాలికల భవితకు 'కిశోరి వికాసం'

నేటినుంచి అవగాహన కార్యక్రమాలు: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మే 1(ఆంధ్రజ్యోతి): బాలికల రక్షణ, అభివృద్ధి ముఖ్య లక్ష్యాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమమే కిశోరి వికాసం అని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. కిశోరి వికాసంపై సమ్మర్ క్యాంపైన్ నిర్వహణకు సంబంధించి ప్రచురించిన పోస్టర్‌ని గురువారం విడుదల చేశారు. కిశోరి వికాసం ద్వారా బాలికలు అందరిలోను విద్య, నైపుణ్యం, ఎదుగుదల, పోటీతత్వం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర 12అంశాలపై బాలికల్లో అవగాహన కల్పించనున్నారన్నారు. మే 2నుంచి జూన్ 10 వరకు జిల్లా మహిళా,శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వార్డు, గ్రామ సచివాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 11ఏళ్లనుంచి 18ఏళ్లలోపుగల బాలికల్లో డ్రాపౌట్స్‌ను గుర్తించి వారిని గ్రూపులుగా తయారు చేసి శిక్షణ ఇవ్వనున్నారన్నారు. 2న సమష్టి పరిచయం, 6న లైంగిక విద్య, 9న బాల్య వివాహం, 13న బాలల హక్కులు, 16న రక్తహీనతపై అవగాహన కల్పిస్తామన్నారు.

కులగణనతో సామాజిక న్యాయం

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు



తుని రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): కులగణనతో సామాజిక న్యాయం సాధ్యమని కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు టీడీపీ బీసీ సీనియర్ నేత, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. కులగణనతో వెనుకబడిన వర్గాలు రాజ్యాంగంలో నిర్దేశించిన సామాజిక న్యాయానికి దగ్గరవుతాయనే నమ్మకం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. జనాభా గణనకు అనుబంధంగా కులగణనను కూడా చేపట్టాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చాలా ఏళ్లుగా జనాభా గణన, కులగణన జరగలేదని ఇప్పుడు కేంద్రప్రభుత్వం గణన చేపట్టేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కులగణన సుదీర్ఘకాలంగా జరగకపోవడంవల్ల వెనుకబడిన వర్గాలు చాలా అవకాశాలు కోల్పోయాయని కేంద్ర క్యాబినేట్ నిర్ణయంతో ఆయా వర్గాల్లో నూతనోత్తేజం కలుగుతోందని యనమల అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దిష్టమైన గడువును నిర్ణయించి జనాభా గణన, కుల గణన పూర్తిచేయాలని యనమల కోరారు.

ఈ బస్సులు వస్తున్నాయ్!



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

● కాకినాడ, రాజమహేంద్రవరం డిపోలకు వంద బస్సులు మంజూరు
● రెండో విడతలో అమలాపురం, తుని డిపోలకు కేటాయింపు
● డిపోల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను పరిశీలించిన ఆర్టీసీ ఉన్నతాధికారులు

త్వరలో జిల్లా రోడ్లపై విద్యుత్ బస్సులు పరుగులు పెట్టనున్నాయి. కాలుష్యానికి తావులేకుండా, కుదుపులకు అవకాశమివ్వని.. అధునాతన బస్సులు రయ్.. రయ్‌మని తిరగనున్నాయి. విద్యుత్ బస్సులతో కాలుష్యం తగ్గడమే కాదు.. చార్జీల బాదుడూ తప్పనుంది. రానున్న కొన్నినెలల్లోనే డీజిల్ బస్సుల స్థానంలో విద్యుత్ బస్సులను దశలవారీగా ప్రవేశపెట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

త్వరలో టెండర్లు ఖరారు

పీఎం ఈ-బస్ సేవా పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఏపీలో 1050 బస్సులను ప్రవేశపెట్టనుంది. కన్వర్జెన్స్ ఎనర్జీ సర్వీసెస్ లిమిటెడ్(సీఈఎస్ఎల్)తో కలిసి ఈ బస్సులను ప్రవేశపెట్టేందుకు ఇప్పటికే టెండర్లు కూడా పిలిచింది. బిడ్లు దాఖలై.. త్వరలో టెండర్లు ఖరారు కానున్నాయి. బస్సు కంపెనీలను ఎంపిక చేసి వాటికి కిలోమీటరుకు ఎంత ధర చొప్పున చెల్లించాలో నిర్ణయిస్తారు. కేంద్రం ఒక్కో బస్సుకు రూ.35లక్షల మేర ఆయా కంపెనీలకు నేరుగా రాయితీ ఇవ్వనుంది. అద్దె ప్రాతిపదికన ఈ బస్సులను ఆర్టీసీ నడపనుంది.

పర్యావరణ పరిరక్షణకు విద్యుత్ బస్సులు

పర్యావరణ పరిరక్షణలో భాగంగా కేంద్రప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో 11 నగరాలకు 750 ఎలక్ట్రికల్ బస్సులను మంజూరు చేసింది. తిరుమలకు తిప్పేందుకు అదనంగా 350 బస్సులు కేటాయించాలని సీఎం చంద్రబాబు కేంద్ర గృహ, పట్టణాభివృద్ధిశాఖ మంత్రికి లేఖ రాయగా.. కేంద్రం అంగీకారం తెలిపింది. దీంతో కేంద్రం అందజేసిన బస్సుల సంఖ్య 1050కు చేరింది. ఇందులో విశాఖ, విజయవాడ, గుంటూరు, నెల్లూరు డిపోలకు వంద చొప్పున బస్సులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కాకినాడ, రాజమహేంద్రవరం, కర్నూలు, కడప, అనంతపురం, తిరుపతి, మంగళగిరి డిపోలకు 50 బస్సులు చొప్పున అందించనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం డిపోలకు ఈ బస్సులు రానున్నాయి. వీటి పనితీరు ఆధారంగా రెండో విడతలో అమలాపురం, తుని డిపోలకు ఈ బస్సులను అందజేయనున్నారు.

చౌకగా.. సౌకర్యవంతంగా..

ప్రస్తుతం డీజిల్‌తో నడుస్తున్న బస్సులతో పోలిస్తే విద్యుత్ బస్సుల్లో ప్రయాణం చాలా చౌకని అంటున్నారు. అంతేకాదు శబ్ద కాలుష్యం లేకుండా ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుంది. సాధారణ బస్సులు కిలోమీటరుకు సగటున రూ.7.65 పైసల వ్యయమవుతుండగా.. ఎలక్ట్రికల్ బస్సులో రూ.1లోపే ఉంటుంది. విద్యుత్ బస్సులు ఒకసారి ఛార్జింగ్‌తో 150 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తాయి. రాను, పోను వంద కిలోమీటర్లు దూరంలో ఉండేలా నగరాలు, రూరల్ ప్రాంతాలకు బస్సులను తిప్పనున్నారు. ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సుల కింద అనేక ప్రాంతాలకు నడపనున్నారు.

కాకినాడ బస్సు డిపో పరిశీలన

విద్యుత్ బస్సుల చార్జింగ్‌కు అవసరమైన ఏర్పాట్లను డిపోల్లోనే చేస్తున్నారు. కాకినాడ డిపోలో ఆ పనులు జరుగుతున్నాయి. ఇటీవల కొందరు ఉన్నతాధికారులు విజయవాడ నుంచి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు సంబంధించిన విషయాలను పరిశీలించారు. బస్సులను ఎక్కడ నిలుపుదల చేయాలి? వాటికి అవసరమైన చార్జింగ్ పాయింట్లకు అవసరమైన విద్యుత్‌లైన్ వంటి విషయాలపై కాకినాడ డిపో అధికారులతో చర్చించారు. విద్యుత్ బస్సుల రాకతో ఆర్టీసీపై భారం తగ్గనుందని ఆర్టీసీ అధికారులు అంటున్నారు. డిజిల్ ధరలు పెరిగినప్పుడు ప్రయాణికులు పడే భారం ఈ విద్యుత్ బస్సుల రాకతో తప్పనుందని చెబుతున్నారు.

జ్ఞాన్‌పోస్టును వినియోగించుకోవాలి

● రూ.100తో 5కిలోల వరకూ బట్వాడా
● పోస్టల్ సూపరింటెండెంట్ శేషారావు

రాజమహేంద్రవరం, మే 1(ఆంధ్రజ్యోతి): ఈనెల 1 నుంచి భారత తపాలాశాఖ నూతనంగా ప్రవేశపెట్టిన 'జ్ఞాన్ పోస్ట్'ని వినియోగించుకోవాలని రాజమండ్రి పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ కె.శేషారావు కోరారు. ఈసేవ ద్వారా పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ని పార్సిల్, బుక్ పోస్టుకంటే తక్కువ ఖర్చుతో పోస్టు చేయవచ్చన్నారు. గరిష్ఠంగా 5కిలోల వరకూ పంపించవచ్చని ఆయన పేర్కొన్నారు. గుర్తింపు పొందిన విద్యాబోర్డులు, ప్రభుత్వ విశ్వ విద్యాలయాల విద్యార్థుల కరెస్పాండెన్స్, రెగ్యులర్ కోర్సులు, సిలబస్‌లో సూచించిన పుస్తకాలై ఉండాలన్నారు. పాఠ్య పుస్తకాలు, సామాజిక, సాంస్కృతిక, చట్టాలకు లోబడిన మతపరమైన సాహిత్యం వంటివి కూడా జ్ఞాన్‌పోస్ట్ ద్వారా పంపించవచ్చన్నారు. 300 గ్రాముల బరువు వరకూ కేవలం రూ.20,500గ్రా-రూ.25, కిలో-రూ.35, 2కిలోలు రూ.50, 3కిలోలు రూ.65, 4కిలోలు రూ.80, 5కిలోల వరకూ రూ.100తో జ్ఞాన్ పోస్టులో పంపించవచ్చని పేర్కొన్నారు. స్పీడు పోస్టు మాదిరిగా ఆన్‌లైన్ ట్రాకింగ్ సిస్టం ద్వారా లైవ్‌స్టేటస్‌ని తెలుసుకునే సదుపాయం కూడా కల్పించారని ఆయన చెప్పారు. నియమ నిబంధనల కోసం పోస్టాఫీసులో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలు

● 26 జట్లు, 208 మంది క్రీడాకారుల రాక



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, మే 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో 12వ రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేశారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సహకారంతో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈనెల 4వ తేదీ వరకు సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుగులో పోటీలు జరుగుతుయి. 13 ఉమ్మడి జిల్లాల నుంచి 26 పురుషులు, మహిళల జట్ల సభ్యులు 208 మంది వస్తున్నారని నిర్వాహకుడు వెంకటరెడ్డి తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన వసతి, సదుపాయాలను సమకూరుస్తున్నామన్నారు. కోర్టు, వేదిక, మ్యాచ్ రిఫరీలను సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, కోచ్ సాయిప్రసాద్, సోదె మునలయ్య, శిరంగు శ్రీనివాసరావు, పాండ్రంకి రాజు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

రాజీవ్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఆవిర్భావం

కాకినాడసిటీ, మే 1(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారం లక్ష్యంగా కొత్తగా రాజీవ్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఆవిర్భవించింది. కాకినాడజిల్లా పరిషత్ అతిథి గృహంలో గురువారం కార్మిక నాయకుడు, ట్రేడ్ యూనియన్ వ్యవస్థాపకుడు కోలా ప్రసాదవర్మ ఆర్ఎన్‌టీయూసీ జెండా లోగోను ఆవిష్కరించారు. రాష్ట్ర, జిల్లా, నగర, రూరల్ కార్యవర్గాలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వల్లూరి రామ్మోహన్, ఉపాధ్యక్షులుగా లంకే పకీర్‌రాజు, ఉమ్మడి సురేంద్రనాథ్, కార్యదర్శులుగా కదిరి జగన్నాథం, కుక్కల పోతురాజు యాదవ్, కోశాధికారిగా నరుకుర్తి రాజు, విశాఖ జిల్లా అధ్యక్షుడిగా కె.కన్నబాబు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా తురాల శ్రీనివాస్, అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా మోర్తా శోభన్‌బాబు, కాకినాడ సిటీ, రూరల్ అధ్యక్షుడిగా తుమ్మలపల్లి చిన్నలను నియమించారు.

మురమళ్లకు బ్రహ్మోత్సవ శోభ

● ఘనంగా వీరేశ్వరస్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు



స్వామి, అమ్మవారు ఊరేగింపులో ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, మే 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్లలో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు అర్చకుడు, శైవాగమ పండితుడు యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో పూజలకు అంకురార్పణ జరిగింది. గణపతి పూజ అనంతరం స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను వధూవరులుగా చేశారు. సాయంత్రం భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి భద్రపీఠంపై ఆశీనులై గ్రామ వీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనం ఇచ్చారు. సాయంత్రం ఎదురు సన్నాహం జరిపి వధూవరులను ద్వాదశ ప్రదక్షిణలు చేయించారు. రాత్రి స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దంపతులు ప్రభుత్వం తరపున స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉత్సవ విగ్రహాల దాత జంపన రామకృష్ణంరాజు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించి పునీతులయ్యారు. ఆలయ సహాయ కమిషనరు మాచిరాజులక్ష్మీనారాయణ, పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పర్యావరణ పరిరక్షణకు సైకిల్ యాత్ర

● రాజమహేంద్రవరం చేరుకున్న పశ్చిమబెంగాల్ యువకుడు ప్రశాంజిత్ దాస్



రాజమహేంద్రవరంలో సైకిల్ యాత్రికుడు ప్రశాంజిత్ దాస్

రాజమహేంద్రవరం సిటీ, మే 1(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నియంత్రణ, రక్తదానం, ఆరోగ్యం తదితర నినాదాలతో పశ్చిమబెంగాల్‌కు చెందిన యువకుడు సైకిల్ యాత్ర చేపట్టాడు. ఈ క్రమంలో గురువారం రాజమహేంద్రవరం చేరుకున్నాడు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్ సమీపంలో సైకిల్ యాత్ర చేస్తూ కనిపించాడు. ఈసందర్భంగా సైకిల్ యాత్రికుడు ప్రశాంజిత్ దాస్ మాట్లాడారు. తనది పశ్చిమబెంగాల్ రాష్ట్రం మూసిరాబాద్ అని చెప్పారు. జనవరి 2025న పశ్చిమబెంగాల్‌లో తన సైకిల్‌యాత్ర ప్రారంభించానన్నారు. బీటెక్ పూర్తిచేసిన తాను పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నియంత్రణ కోసం ప్రజలను, విద్యార్థులను చైతన్యవంతం చేయడానికి ఈ యాత్ర ప్రారంభించానని చెప్పారు. రోజుకు 60 కిలోమీటర్లు సైకిల్‌తొక్కుతూ పశ్చిమబెంగాల్, జార్ఖండ్, ఒడిస్సా మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 5,200 కిలోమీటర్ల ప్రయాణం చేశానన్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నియంత్రణ, రక్తదానం చేయండి తదితర అంశాలపై ప్రజలను చైతన్యవంతం చేయడానికి ప్రపంచంలో 195దేశాలను చుట్టిరావాలని లక్ష్యంతో ఉన్నానని చెప్పారు. మొత్తం 3లక్షల కిలోమీటర్ల సైకిల్‌యాత్ర టార్గెట్‌గా పెట్టుకుని ముందుకు సాగుతున్నాని చెప్పారు. ఎక్కడికక్కడ రాత్రి బస చేయడానికి స్వచ్ఛంద సంస్థలు, ఇన్‌స్టా పాలోవర్ల సహకారంతో సైకిల్ యాత్ర కొనసాగిస్తున్నానన్నారు. బ్యూటిఫుల్ ఆంధ్రప్రదేశ్ బాగుందని కితాబు ఇచ్చాడు సైకిల్ యాత్రికుడు ప్రశాంజిత్ దాస్.

కులాలు, మతాలపేరుతో విభజించి మోదీ పాలన

● ప్రధానికి ఎన్నికలపై ఉన్నప్రేమ దేశభద్రతపై లేదు
● సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శలు
● ఎర్రజెండాకు కాలం చెల్లలేదు, ఇంకా ఎరుపెక్కుతూనే ఉందని వ్యాఖ్యలు



సభలో మాట్లాడుతున్న జాతీయ కార్యదర్శి నారాయణ

రాజమహేంద్రవరం అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీకి రాష్ట్రాల ఎన్నికలపై ఉన్న ప్రేమ దేశభద్రతపై లేదని, కేంద్ర ప్రభుత్వం కగార్ పేరుతో మావోయిస్టులను ఏరివేయాలనుకోవడం దారుణమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. కులాలు మతాల పేరుతో దేశాన్ని విభజించి పాలన చేస్తున్నారని ఆరోపించారు. గురువారం సీపీఐ జట్ల లేబర్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో నిర్వహించిన మేడే వేడుకల్లో నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంవద్ద పతాకాన్ని ఆవిష్కరించారు. ముందుగా మీడియాతోను, అనంతరం ఆవరోడ్డులో జరిగిన బహిరంగ సభలోనూ నారాయణ మాట్లాడుతూ ప్రధాని మోదీ 2వ తేదీన అమరావతి వస్తున్న సందర్భంగా ప్రధాని సభలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మీసం మెలేసి అమరావతి పునర్నిర్మాణం జరిగేలా మాట్లాడాలన్నారు. ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తాము నమ్ముతున్నామని, సీఎం చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ప్రత్యేక హోదా కోసం ప్రధానిని ప్రశ్నించాలన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ అమరావతిని పూర్తిగా నాశనం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ మోదీ పక్షంగానే మారిపోయాయన్నారు. కార్మిక చట్టాల రద్దుతో కార్మికుల అన్ని హక్కులు కాలరాస్తున్నారని, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులైతే బానిస బతుకులు సాగిస్తున్నారన్నారు. సెప్టెంబరులో సీపీఐ జాతీయ మహాసభలు చండీఘడ్‌లో జరుగుతాయని, ఇండియా కూటమిని బలోపేతం చేసే దిశగా ఈ సభల్లో చర్చిస్తామన్నారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళపై బీజేపీ వాళ్ల కోడిగుడ్లుతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎర్రజెండాకు కాలం చెల్లలేదని, ఇంకా ఎరుపెక్కుతూనే ఉందని, దోపిడీ ఉన్నంతవరకూ ఎర్రజెండా బతికే ఉంటుందని పేర్కొన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ కోట్ల రూపాయల విలువైన భూములను అంబానీ, అదానీలకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, దీన్ని అడ్డుకునేందుకు ప్రతి కార్మికుడు పోరాడాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ ఎనిమిది గంటల పనిదినం, ఉద్యోగ భద్రత కోసం ప్రతి కార్మికుడు ఉద్యమించాలన్నారు. జట్లులేబర్ యూనియన్ అధ్యక్షుడు కూండ్రపు రాంబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఏఐటీయూసీ రాష్ట్ర కోశాధికారి బీవీవీ కొండలరావు, నగర కార్యదర్శి వి.కొండలరావు, సప్ప రమణ, సునీల్, కె.శ్రీనివాస్, పి.త్రిమూర్తులు పాల్గొన్నారు. ముందుగా ప్రదర్శన నిర్వహించారు. పలుచోట్ల పతాకాలను ఆవిష్కరించారు.

తీరంలో మత్స్యకారుల బోటు ర్యాలీ



సముద్రంలో బోటు ర్యాలీ నిర్వహిస్తున్న మత్స్యకారులు

తొండంగి, మే 1(ఆంధ్రజ్యోతి): వేట నిషేధ భృతిని రూ.20వేలు ఇచ్చి మత్స్యకారులకు ప్రయోజనం చేకూర్చిన రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ మండల మత్స్యకారులు సముద్రంలో బోట్లతో ర్యాలీ నిర్వహించారు. గురువారం పెరుమాళ్ళపురం వద్ద బోట్లలో తెలుగుదేశం జెండాలు చేతపట్టి థ్యాంక్యూ సీఎం సార్ అంటూ బోట్లతో ర్యాలీ నిర్వహించారు. మండల మత్స్యకారులకు ఎమ్మెల్యే యనమల దివ్య, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు కృషితో రూ.5కోట్ల52లక్షల పరిహారం అందిందని గతంలో ఎప్పుడూ ఇంత మొత్తం విడుదల కాలేదని హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్, మత్స్యకార నేతలు కోడ వెంకటరమణ, చొక్కా అప్పారావు, మహంకాళి, చొక్కా కాశీశ్వరరావు, గంటా లక్ష్మణ్, రాంబాబు, బుల్లబ్బాయి పాల్గొన్నారు.

8 మందికి డిప్యూటీ తహసీల్దార్లుగా పదోన్నతి

కలెక్టరేట్ (కాకినాడ), మే 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 8మంది సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ తహసీల్దార్లుగా పదోన్నతి లభించింది. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా నోడల్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం ఉత్తర్వులు వెలువరించారు. పదోన్నతి పొందిన వారిలో పీబీఎస్‌వీ ప్రసాద్‌రావు, ఎస్.కె పద్మవేణి, జి.ఫణీంద్ర రఘుపతిరావు, ఆర్‌టీటీ విజే సీతారామయ్య, జే.ధర్మేంద్ర, ఎం. సత్యవెంకటేష్, ఎం.దొరబాబు, బి.రేవతిలు ఉన్నారు. తాత్కాలిక ప్రాతిపదికన వీరిని నియమించారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి జట్టు కార్మికుడి మృతి



కొప్పిశెట్టి శ్రీనివాసరావు

ముమ్మిడివరం, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవం రోజున ముమ్మిడివరంలో ఓ జట్టు కార్మికుడు ప్రమాదవశాత్తూ ట్రాక్టరు పైనుంచి జారి కిందపడి మృతి చెందాడు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ నక్కావారిపేట కాల్వగట్టు వద్ద జరిగింది. నగర పంచాయతీ పరిధిలోని చింతలమెరకకు చెందిన కొప్పిశెట్టి శ్రీనివాసరావు (49) జట్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం ముమ్మిడివరం నుంచి ట్రాక్టరుపై సిమెంటు, ఐరన్ తరలిస్తుండగా నక్కావారిపేట కాల్వగట్టు సమీపంలో ట్రాక్టరు పైనుంచి జారి తీవ్రంగా గాయపడ్డాడు. ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా మృతి చెందాడు. శ్రీనివాసరావుకు భార్య పరమేశ్వరి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎస్ఐ టి.జ్వాలాసాగర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. శ్రీనివాసరావు మృతితో ఆ కుటుంబం ఆధారాన్ని కోల్పోయింది.

వారు ప్రమాదకర ఆర్థిక ఉగ్రవాదులు

● మాజీ సీఎం జగన్, మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డిపై అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

కార్పొరేషన్ (కాకినాడ), మే 1 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్, అనపర్తి మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ప్రమాదకర ఆర్థిక ఉగ్రవాదులని అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి విమర్శించారు. అనపర్తి మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి కూటమి ప్రభుత్వంపైన, తనపై చేస్తున్న ఆరోపణలపై స్పందించి గురువారం కాకినాడలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. తనపై చేస్తున్న ఆరోపణలకు మాజీ ఎమ్మెల్యే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. పెదపూడి మండలం దోమాడ గ్రామంలో ఆర్ అండ్‌బీ రోడ్డు పక్కన ఇల్లు కోల్పోయి నిరాశ్రయులైన ఐదు కుటుంబాల వారికి వైసీపీ నేతల నుంచి ముప్పు ఉందన్నారు. గతంలో వైసీపీ హయాంలో అనపర్తి నియోజకవర్గంలో ఎన్నో అక్రమాలు, దౌర్జన్యాలు జరిగాయని అవన్నీ అప్పటి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి హయాంలోనేనని చెప్పుకొచ్చారు. 2021లో దోమాడలో నాలుగున్నర ఎకరాల ను గోవిందరాజులు, రాహుల్‌రెడ్డి లే అవుట్ చేశారన్నారు. దీనికి అనుమతులు ఇచ్చి 45సెంట్లు సామాజిక స్థలంగాను, నాలుగు లక్షల ఫీజు రుడాకు చెల్లించారన్నారు. నిరాశ్రయులైన ఐదు కుటుంబాల వారికి అప్పటి ఎమ్మెల్యే పట్టాలిచ్చారని చెప్పారు. గత నాలుగు నెలలుగా తనకేమీ తెలియకుండా ఆ బాధితులతో రహస్య సమావేశాలు నిర్వహించి వారిని ఆయన స్వార్థానికి వినియోగించుకున్నారన్నారు. లేఅవుట్ యజమానులకు, సూర్యనారాయణరెడ్డికి మధ్య సంబంధాలు బెడిసి కొట్టడంతో ఆ ఇళ్లను కూల్చేందుకు ఆయనే కారణమయ్యారన్నారు. ఆ లేఅవుట్లలో ఎవరూ స్థలం కొనవద్దని ప్రచారంచేసిన సంగతిని రామకృష్ణారెడ్డి గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా ఉన్న సూర్యనారాయణరెడ్డి హయాంలో ఎన్నో అక్రమాలు జరిగాయని, కర్రి అరుణకుమారి, కోటిపల్లి కామాక్షి, పంపన ఆనందరావు ఆత్మహత్యలకు దమ్ము శివయ్య ఆత్మహత్యాయత్నానికి ఆయన అనుచరులే కారణమన్నారు. వైసీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ దోమాడ ఘటనపై తన గురించి అనవసర వ్యాఖ్యలు చేశారని చెప్పారు. ఆయన రాజానగరంలో రూ.5కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని, కలెక్టర్‌ను కలిసి విచారణ చేయాలని ఫిర్యాదు చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ కాకినాడజిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, మీడియా ప్రతినిధి నాని, నాయకులు యెనిమిరెడ్డి మాలకొండయ్య, దత్తుడు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నిందితుడి ఇంటిపై దాడి

● ఎస్.అచ్చుతాపురంలో ఉద్రిక్తత



విలపిస్తున్న మృతుడి తల్లిదండ్రులు



కుక్కల నాని (ఫైల్)

సర్పవరం జంక్షన్, మే 1 (ఆంధ్రజ్యోతి): యువకుడి హత్యకు కారణమైన నిందితుడి ఇంటిపై మృతుడి కుటుంబీకులు దాడికి పాల్పడి ధ్వంసం చేసిన సంఘటన గురువారం సాయంత్రం ఎస్.అచ్చుతాపురంలో చోటుచేసుకుంది. కాకినాడ కార్పొరేషన్ 48వ డివిజన్ ఎస్.అచ్చుతాపురం అంబేడ్కర్ వీధిలో నివాసముంటున్న కుక్కల నాని, అదే ప్రాంతానికి చెందిన పెంటి కృష్ణప్రసాద్ (జాజి) కుటుంబాల మధ్య ఇంటి సరిహద్దు విషయంలో విబేదాలు ఉన్నాయి. గతనెల 25వ తేదీ సాయంత్రం 4గంటల సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న కుక్కల నానిపై కృష్ణప్రసాద్ (జాజి) చాకుతో దేహంపై పలు మార్లు విచక్షణారహితంగా పొడిచి పరారయ్యాడు. తీవ్ర రక్తస్రావంతో కిందపడి ఉన్న నానిని గమనించిన కుటుంబీకులు అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు కుటుంబీకులకు అప్పగించడంతో బంధువులు స్వస్థలానికి తీసుకువచ్చారు. మృతదేహాన్ని చూసిన కుటుంబీకులు తీవ్ర ఆగ్రహానికిగురై నిందితుడి ఇంటిపై రాళ్లు రువ్వి ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న కాకినాడరూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను వారించారు. అయినా వారు వినకుండా మృతదేహంతో ఆందోళన చేపట్టారు. మృతుడు కుటుంబానికి న్యాయం జరిగే వరకు అంత్యక్రియలు జరగనివ్వమన్నారు. పోలీసులు సర్దిచెప్పడంతో శాంతించారు. నిందితుడు కృష్ణప్రసాద్‌ని గతనెల 26న అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ చైతన్యకృష్ణ తెలిపారు.

ఆరోగ్యానికి బ్లాక్ రైస్ మంచిది

● ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ నరసింహారావు

దివాన్‌చెరువు, మే 1(ఆంధ్రజ్యోతి): బ్లాక్‌రైస్‌లో ఐరన్, జింక్ వంటి పోషకాలు ఉంటాయని, ఆరోగ్యా నికి మంచిదని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. పశ్చిమగోదావరిజిల్లా మార్టేరులో గురువారం గోదావరి మండల పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం జరిగిందన్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరిజిల్లాల్లో 2025-26లో అమలు పరచబోయే విస్తరణ కార్యాచరణను రెండురోజులపాటు శాస్త్రవేత్తలు, రైతులు ఇందులో చర్చిస్తారన్నారు. బ్లాక్‌రైస్ (బీపీటీ 2841) బియ్యంను రంగంపేట అభ్యుదయ రైతు పోతుల పద్మారావు కలెక్టర్ నాగరాణి, ఇతర అతిథులకు అందజేశారన్నారు. తాను, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ ఇచ్చిన ఈవిత్తనంను ఆయన వృద్ధి చేశారని తెలిపారు. వచ్చే సార్వాకు 500 కిలోల విత్తనం లభ్యత తన వద్ద ఉందని రైతు పద్మారావు తెలిపారని నరసింహారావు చెప్పారు.

ముగ్గురు దొంగల అరెస్టు

● రూ.12.50లక్షల బంగారు ఆభరణాలు స్వాధీనం

మామిడికుదురు, మే 1(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాలోని చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను అరెస్టుచేసి వారి వద్ద నుంచి రూ.12.5లక్షల విలువచేసే చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు తెలిపారు. గురువారం నగరం పోలీసుస్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో సీఐతోపాటు నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ చోరీలకు సంబంధించిన వివరాలు తెలిపారు. పెదపళ్లకు చెందిన కుడుపూడి నాగరాజు, ఆలమూరు మండలం కండ్రిగపేటకు చెందిన వాసంశెట్టి వీరబాబు, గువ్వల చంద్రశేఖర్, మరో నిందితుడు గుత్తుల సుభాష్ ముఠాగా ఏర్పడి పలు దొంగతనాలకు పాల్పడ్డారని, వీరిలో ముగ్గురిని అరెస్టుచేయగా గుత్తుల సుభాష్ పరారీలో ఉన్నట్టు తెలిపారు. వీరిపై నగరం, తాడేపల్లిగూడెం, తడికలపూడి, ద్వారకాతిరుమల, దేవరపల్లి, పెరవలి, దెందులూరు, జంగారెడ్డిగూడెం పోలీసుస్టేషన్లలో పలు దొంగతనాల కేసులు నమోదయ్యాయని, వీరు చైన్ స్నాచింగ్‌లతో పాటు మోటారు సైకిళ్ల దొంగతనాలు చేస్తారన్నారు. పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురంలో బంగారం అమ్మేందుకు వెళుతుండగా వీరిపై అనుమానం వచ్చిన నగరం ఎస్ఐ చైతన్యకుమార్ అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా వీరి నేరాలు బయటపడ్డాయని సీఐ తెలిపారు. నేరస్తులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐలు భీమరాజు, గజేంద్ర, ఎస్ఐలు చైతన్యకుమార్, పరదేశీలు, కానిస్టేబుళ్లు కృష్ణసాయి, శ్రీను, దుర్గాప్రసాద్, అర్జునరావు, సుభాకర్‌లను అంబేడ్కర్ కోనసీమజిల్లా ఎస్పీ కృష్ణారావు అభినందించారు.



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ భీమరాజు

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

నేటి నుంచి కిశోరి వికాసం సమ్మర్ క్యాంపైన్

గొల్లప్రోలు రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): కిశోరి వికాసం సమ్మర్ క్యాంపైన్‌పై ఏఎన్ఎంలు, వీవోఏలకు గురువారం గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం నుంచి జూన్ 10 వరకు జరిగే క్యాంపైన్‌కు సంబంధించిన పుస్తకాల కిట్లను ఎంపీడీవో స్వప్న అందజేశారు. ఐసీపీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ రాణి, ఐసీడీఎస్ సూపర్వైజర్ మానసాదేవి పాల్గొన్నారు.



పెద్దాపురంలో నినాదాలు చేస్తున్న రైతు కూలీ సంఘం ప్రతినిధులు


తాళ్లరేవులో...


పిఠాపురంలో కార్మిక సంఘాల ప్రదర్శన

అరుణ పతాక రెపరెపలు

ఘనంగా మే డే

కాకినాడ సిటీ, మే 1 (ఆంధ్రజ్యోతి): ది కాకినాడ మినీ గూడ్స్ ఆటో ఓనర్, డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 139వ కార్మిక దినోత్సవాన్ని వార్ఫు రోడ్డులోని యూనియన్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎలుగుబంటి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మేడే జెండాను ఎగురవేశారు. కార్మికులకు ఈ-శ్రమ్ కార్డులను అందజేశారు. యూనియన్ అధ్యక్షుడు వెంకటరమణ, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, కార్యదర్శి తుమ్మల రమేష్, కార్మిక శాఖ అధికారి పద్మావతి, యూనియన్ గౌరవ అధ్యక్షుడు గదుల సాయిబాబా, కార్యదర్శి చాట్ల గురుమూర్తి, ఉపాధ్యక్షుడు పి.వీరవెంకట సత్యనారాయణ, కోశాధికారి కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా, ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్మికులకు టీఎన్టీయూసీ అండగా ఉంటుందని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సబ్బతి ఫణీశ్వరరావు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. సాంబమూర్తినగర్‌లోని కార్మిక సంఘాల బ్రాంచి వద్ద ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు కార్మిక జెండాను ఆవిష్కరించి సుమారు 100 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మొయ్యేటి సూర్యప్రకాశరావు, రూరల్ ఇన్‌చార్జి పిల్లి చిన్న, ఐఎఫ్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షురాలు కె.రమాదేవి, తాళ్లూరి రమ్యకృష్ణ, కాంగ్రెస్ నాయకులు దాట్ల గాంధీరాజు, కంభం రాజబాబు, నవుడు గోవిందు, వనుము వెంకటరమణ, గోవర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిర్వహించిన మేడే వేడుకల్లో పంచాయతీ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రాగుల రాఘవులు మాట్లాడారు. పంచాయతీల్లో ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, వారికి పీఎఫ్, ఈపీఎఫ్, ఈఎస్ఐ హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గూడుపు నూకరాజు ఎర్ర జెండాను ఆవిష్కరించి అమరవీరులకు జోహార్లర్పించారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యుడు గుబ్బల ఆదినారాయణమూర్తి, మేడపాటి గోపాలకృష్ణ, దోమాడ ఎర్రియ్య, మంగళగిరి త్రినాథ్, సింగంపల్లి రాజు, శెట్టి నాయుడు, ఆకుల సంతోష్, కొరిపల్లి అన్నవరం, నాగమల్లి మహేష్, పైడిమల్ల త్రిమూర్తులు, కాకినాడ అన్నవరం, నీలాపు స్వామి, ఆకుల దేవి పాల్గొన్నారు. వేళంగిలో ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు గణేశుల శ్రీనివాస్ ఎర్ర జెండాను ఆవిష్కరించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు జె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధిని ప్రభుత్వం తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. యాసలపు సూర్యారావు భవనంలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నేత చింతల సత్యనారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం నుంచి బైలపూడి నూకరాజు, పాండవగిరి పెయింటింగ్ యూనియన్ ఆధ్వర్యంలో సినిమా సెంటర్లో వడ్డి సత్యనారాయణ, మరిడమ్మ తల్లి పెయింటింగ్ యూనియన్ ఆధ్వర్యంలో వినాయకుని గుడి సెంటర్‌తో పాటు పలు యూనియన్ల ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు గడిగట్ల సత్తిబాబు, దారపురెడ్డి క్రాంతికుమార్, దాడి బేబీ, గంగాధర్, రాజు, రవి, బాషా, సుధాకర్, తాడిశెట్టి గంగ పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక, ప్రజా సంఘాల సభ్యులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఉప్పాడ సెంటర్లో బహిరంగ సభ జరిగింది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రాజకుమార్, వివిధ సంఘాల నాయకులు కుంచే చిన్న, కె.విశ్వనాథం, కోనేటి రాజు, కె.నాగేశ్వరరావు, డి.సత్యనారాయణ, పి.వీరబాబు, రామన్నరాజు, శ్రీనివాస్, నూతాటి కృష్ణ, అప్పన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద మే డే పతాకాన్ని యూటీఎఫ్ సీనియర్ నాయకుడు దాడి పద్మనాభం ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అనిశెట్టి సీతారామరాజు, ఎంవీ సత్యనారాయణ, పాపారావు, ఈపు గోవిందరాజులు, పీవీ సత్యనారాయణ పాల్గొన్నారు. సీఐటీయూ, సీపీఎం, సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మే డే వేడుకలు జరిగాయి.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ పెద్దాపురం ప్రాజెక్ట్ అధ్యక్షురాలు వడ్డి ఎస్తేరు రాణి, ప్రకృతి ఈశ్వరరావు, చల్లా మహేష్ తదితరులు పాల్గొన్నారు. ఐఎంఎల్ డిపో, మెహెర్ కాంప్లెక్స్, గణపతినగరంల్లో సీఐటీయూ జెండాలను ఆవిష్కరించారు. సీపీఎం కార్యదర్శి ప్రసాదరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాలరాసేందుకు చూస్తోందన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. వారికి టీడీపీ నాయకులు నక్కా జానకిరామయ్య, శ్రీను సోదరుల సౌజన్యంతో చల్లటి మజ్జిగ పంపిణీ చేశారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): కార్మిక సంఘం నేత టేకుమూడి ఈశ్వరరావు ఆధ్వర్యంలో పలు కార్మిక సంఘాలు గుడ్డివానితూము సెంటరు నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించాయి. యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం, ఆటోడ్రైవర్లు, ఆక్వా డ్రైవర్లు, యానిమేటర్లు, ఆశా, అంగన్వాడీ వర్కర్లు, కౌలు రైతు సంఘం ప్రతినిధులు ర్యాలీలో పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): యండపల్లి, జొన్నలగరువు గ్రామాల్లో ఏఐసీసీటీయూ జెండాలను ఐప్వా జిల్లా అధ్యక్షుడు శీలం అప్పలరాజు, కాశి ఏసురత్నం ఆవిష్కరించారు. రాష్ట్ర నాయకుడు గొడుగు సత్యనారాయణ, యండపల్లి ఎంపీటీసీ బర్రే రవి, కొల్లా వేణుగోపాల్, భవన నిర్మాణ, ఉపాధి హామీ పథకం, ఆటో, మోటార్ యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.



సామర్లకోటలో...


కాకినాడ సూర్యనారాయణపురంలో మే డే పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు


కాకినాడలో మహిళకు చీర అందజేస్తున్న ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు



గొల్లప్రోలులో మే డే పతాకాన్ని ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

పారిశుధ్య కార్మికులకు సత్కారం

కలెక్టరేట్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): మేడే సందర్భంగా రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు క్యాంపు కార్యాలయంలో పారిశుధ్య కార్మికులను సత్కరించారు. ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి, చక్రధర్‌రావు, వెంకటేశ్వరరావు, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



కరపలో నినదిస్తున్న కార్మిక సంఘాల నాయకులు


కాకినాడలో ఎంపీ సతీష్ క్యాంపు కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు సత్కారం


కొత్తపల్లి మండలం యండపల్లిలో...

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిఠాపురం రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలంలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ డీఈఈ ప్రభాకర్ తెలిపారు. కుమారపురం సబ్ స్టేషన్ పరిధిలోని కుమారపురం, ఎఫ్‌కేపాలెం ఫీడర్ పరిధిలో కుమారపురం, విరవాడ, ఎల్ఎన్‌పురం, ఆనందనగర్, నాగంపేట గ్రామాల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కరెంటు ఉండదు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి 33/11 కేవీ సబ్ స్టేషన్ వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పెద్దాపురం డీఈఈ ఏపీఎన్‌డీఎస్ ప్రభాకర్ తెలిపారు. వాకతిప్ప, కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, రవీంద్రపురం, పిల్లి అనంతలక్ష్మి కాలనీ, కొత్త సూరాడపేట, కొత్త మాయాపట్నం, సుబ్బంపేట, రంగంపేట, ఉప్పాడ, అమీనబాద్, పల్లిపేట, పాత మాయాపట్నం, యండపల్లి, అమరవల్లి, పొన్నాడ, నాగులాపల్లి చెరువులు, మూలపేట వాటర్ వర్క్సులకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సామర్లకోట సబ్ స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ ప్రభాకర్ తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉప్పు వారిసత్రం మీదుగా వెళ్లే ఫీడర్‌లోని టిడ్కో అపార్ట్‌మెంట్స్‌లో సరఫరా ఉండదన్నారు. మండలంలోని ఉండూరు, పి.వేమవరం, కాపవరం, గొంచాల, బ్రహ్మానందపురం, రావువారిచంద్రంపాలెం, నవర, పవర, వెంకటకృష్ణరాయపురంల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.


కేంద్ర మంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న రమేష్

కిట్స్ కాలేజీ అకడమిక్ అడ్వైజర్‌కు అవార్డు

పెద్దాపురం, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దివిలి కిట్స్ కాలేజీ అకడమిక్ అడ్వైజర్ వీవీ రమేష్ 'అకడమిక్ అడ్వైజర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు అందుకున్నారు. గత నెల 30న ఢిల్లీలో జరిగిన విశ్వవిద్యాలయాల సమ్మేళనం-2025లో కేంద్ర జలశక్తి మంత్రి రాజభూషణ్‌చౌదరి, హైకమిషన్ కౌన్సిలర్ నీలేష్‌కుమార్ ఆయనకు అవార్డు అందజేశారు. రమేష్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మోహన్‌రెడ్డి, డీన్ (అకడమిక్) డాక్టర్ ఇ.సర్వరామేశ్వరుడు, ఈవో జెన్నిబాబు అభినందించారు.

పిఠాపురం రూరల్ ఎస్ఐగా జానీ బాషా

పిఠాపురం రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం రూరల్ ఎస్ఐగా ఎస్కే జానీబాషా గురువారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ పోర్టు పోలీసుస్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తూ అటాచ్‌మెంట్ పిఠాపురం పట్టణ అడిషనల్ ఎస్ఐగా పనిచేశారు. గతంలో పిఠాపురం రూరల్ ఎస్ఐగా పనిచేసిన గుణశేఖర్ లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడంతో అప్పటి నుంచి జానీబాషా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు రెగ్యులర్ ఎస్ఐగా నియమిస్తూ ఎస్పీ బిందుమాధవ్ ఉత్తర్వులు జారీ చేశారు. అందరి సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని జానీబాషా తెలిపారు.





శిక్షకులకు క్రీడా కిట్లు అందజేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

'విద్యార్థులు క్రీడా నైపుణ్యం పెంపొందించుకోవాలి'

కార్పొరేషన్(కాకినాడ), మే 1(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నెల పాటు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు క్రీడా నైపుణ్యం పెంపొందించుకోవాలని కలెక్టర్ షాన్ మోహన్ కోరారు. గురువారం కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయనతో పాటు ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్ ప్రారంభించారు. వివిధ క్రీడాంశాల్లో విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చే శిక్షకులకు వారు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్, శిక్షకులు రవిరాజు, లంక జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్ర అభివృద్ధిలో శ్రామికులే అసలైన భాగస్వాములు'

కాకినాడ, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధిలో శ్రామికులే అసలైన భాగస్వాములు అని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. గురువారం ఆయన నగరంలో పలుచోట్ల మేడే పతాకాలను ఆవిష్కరించి కార్మికులకు స్వీట్లు పంపిణీ చేశారు. హెచ్ఎంఎస్ యూనియన్, మినీ వ్యాన్స్ అసోసియేషన్, గూడ్స్ వ్యాన్స్ అసోసియేషన్, వినాయక డీప్ వాటర్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్, లక్ష్మీ డీప్ వాటర్‌పోర్టు వర్కర్స్ యూనియన్, స్టిచింగ్ వర్కర్స్ యూనియన్, స్టీవ్‌డోర్స్ అసోసియేషన్, ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ షోర్ లేబర్ యూనియన్, స్కూటర్ మెకానిక్స్ అసోసియేషన్, సూపర్‌బజార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయాల్లో మేడే పతాకాలను ఆవిష్కరించి కార్మికులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో పినపోతు రాము, పినపోతు జీవరత్నం, చొక్కా నానాజీ, రాముడు, ఎలిపే శ్రీనివాస్, మట్టా చిన్ని, ఓలేటి పాండురంగడు, పితాని నూకరాజు తదితరులు పాల్గొన్నారు.


ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ప్రమాణం చేసిన నానాజీని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా నానాజీ

గొల్లప్రోలు, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం గొల్లప్రోలు మండల శాఖ అధ్యక్షుడిగా కేదారశెట్టి వెంకట సూర్యనారాయణ (నానాజీ) ప్రమాణం చేశారు. గొల్లప్రోలులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో నానాజీ, ఇతర కార్యవర్గ సభ్యులతో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు (బాబీ) ప్రమాణం చేయించారు. అధ్యక్షుడు నానాజీ, ఉపాధ్యక్షుడు దంగేటి మనోహర్, కార్యదర్శి ములుకూరి గోపాలకృష్ణ, కోశాధికారి గొల్లపూడి సాయి వెంకటేష్, సహాయ కార్యదర్శి మద్దుల నాగేశ్వరరావులను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అభినందించారు. సంఘం రాష్ట్ర, ఉమ్మడి జిల్లా ప్రతినిధులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.


సూర్యనారాయణపురంలో పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

27వ డివిజన్‌లో పింఛన్ల పంపిణీ

కాకినాడ, మే 1 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ పెన్షన్ అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. 27వ డివిజన్ సూర్యనారాయణపురంలో పలువురికి ఆయన పింఛన్లు అందజేశారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, కోడూరి కుమారస్వామి, దేవి, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.


పుష్పాంజలి, లోకేష్, తనుశ్రీలకు నగదు పురస్కారాలు అందజేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

టెన్త్ టాపర్లకు నగదు పురస్కారాలు

గొల్లప్రోలు/సామర్లకోట/కరప, మే 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో టాపర్‌గా నిలిచిన గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని తోట పుష్పాంజలి, సామర్లకోట మండల టాపర్‌గా నిలిచిన అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.తనుశ్రీ, కరప మండల టాపర్‌గా నిలిచిన అరట్లకట్ట హైస్కూలు విద్యార్థి తోట లోకేష్‌లను కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం సత్కరించారు. వారికి రూ.10వేలు చొప్పున నగదు పురస్కారాలు, పుస్తకాలు అందజేశారు. డీఈవో పి.రమేష్, డీవైఈవో నాయుడు వెంకటేశ్వరరావు, గొల్లప్రోలు జడ్పీ హైస్కూలు హెచ్ఎం సూర్యప్రకాశరెడ్డి, సామర్లకోట ఎంఈవో వై.శివరామకృష్ణయ్య, హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ, కరప ఎంఈవో పత్తి సత్యనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

కాకినాడ రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ దుమ్ములపేట మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని ఎంఈవోలు కేవీవీ సత్యనారాయణ, సీహెచ్ రవి ప్రారంభించారు. విద్యార్థుల్లోని అంతర్గత సామర్థ్యాలను గుర్తించేందుకు ఈ శిబిరం ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

తుని రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తుని మున్సిపల్ ఛైర్‌పర్సన్ నార్ల భువన సుందరి స్పష్టం చేశారు. 12వ వార్డు మ్యాటర్ వీధిలో ఛైర్‌పర్సన్ పెన్షన్ పంపిణీ చేశారు. పలు వారుల్లో జరుగుతున్న పెన్షన్ పంపిణీ విధానాన్ని కమిషనర్‌ని అడిగి తెలుసుకున్నారు. నూరుశాతం పెన్షన్ పంపిణీ లక్ష్యంగా పని చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. టీడీపీ నాయకులు నార్ల రత్నాజీ, వార్డు కౌన్సిలర్, పలువురు టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఘనంగా మేడే

ఎటపాక, మే 1(ఆంధ్రజ్యోతి): మేడే వేడుకలను గురువారం మండలంలో పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. సీపీఐ, సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రధానంగా గన్నవరం, తోటపల్లి, మురుమూరు, బుట్టాయిగూడెం, కన్నాయిగూడెం తదితర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. స్థూపాలవద్ద జెండాను ఆవిష్కరించారు. మేడే వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. గన్నవరంలో దివంగత సీపీఐ నాయకులు కందుకూరి మంగరాజు స్మారక స్థూపంవద్ద సీపీఐ నాయకులు, ప్రజాప్రతి నిధులు నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు మర్లపాటినాగేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి స్వర్ణ, వల్లభనేని సత్యనారాయణ, ఐవీ, కాక అర్జున్, ఎలిశాల నాగరాజు, వాసం రాము, భద్రమ్మ పాల్గొన్నారు.

చింతూరు: మండలంలో మేడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతర పోరాటం చేయాల్సి ఉందని వక్తలు పేర్కొన్నారు. సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, నాయకులు సీసం సురేష్, పల్లపు పెద్దరాములు, పుల్లారావు, సుబ్బారావు, పొడియం లక్ష్మణ్, ఆశవర్కర్లు, అదే దశలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన సీపీఐ డివిజను నాయకుడు ఎస్కే. రంజాన్, సీఐటీయూ నాయకులు చల్ల రామయ్య, కృష్ణ, సత్యనారాయణ; హరి పాల్గొన్నారు.

వీఆర్‌పురం: మండలంలో మేడే వేడుకలను మండల సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ర్యాలీగా రేఖపల్లిలోని అమరుల స్థూపం వద్దకు చేరుకొని జెండాను జిల్లా కమిటీ సభ్యులు సున్నం రాజులు ఎగురవేసి అమరులకు నివాళులర్పించారు. వీఆర్‌పురంలోను జెండాను ఎగురవేసి అమరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ కారం లక్ష్మి, మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ ఎంపీటీసీ పూనెం ప్రదీప్‌కుమార్, పంకు సత్తిబాబు, గుండుపూడి లక్ష్మణరావు, రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలో గురువారం మేడే వేడుకలను పురస్కరించుకొని సీఐటీయూ మండల కార్యదర్శి కె.శాంతిరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట జండాను ఆవిష్కరించారు. ర్యాలీ జరిపి కార్మికుల హక్కుల సాధనకై పలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, అంగన్వాడీ కార్యకర్తలు జి.బేబిరాణి, కె.బుల్లమ్మ, వీరలక్ష్మి, అమ్మానీ, రాజులమ్మ వీఆర్‌పి వెలుగు యానిమేటర్స్ కార్మికులు పాల్గొన్నారు.

మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెంలో గురువారం ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా మోతుగూడెంలో పలు ట్రేడ్ యూనియన్లు వారి యూనియన్ కార్యాలయంవద్ద 1104 వేమగిరి కిరణ్, ఐఎన్‌టీయూసీ రాంప్రసాద్, 1535 ఎం.లక్ష్మణరావు, సీఐటీయూ చింతా రాంబాబు, బొల్లిశెట్టి రమణ, ఏఐటీయూసీ వాక శ్రీనివాసరావు, టీఎన్‌టీయూసీ కార్యాలయంవద్ద ముఖ్యఅతిథి మోతుగూడెం ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు జెండా ఎగురవేశారు. మోతుగూడెం టీఎన్‌టీయూసీ యూనియన్ నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కూనవరం: మేడేను మండలంలో ఘనంగా నిర్వహించారు. సీపీఎం, సీపీఐతో పాటు ఉపాధ్యాయ సంఘాలు, కార్మిక సంఘాలు జెండాను ఎగురవేసి మేడే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బాబు, మేకల నాగేశ్వరరావు, తాళ్లూరు శ్రీను, యూటీఎఫ్ నాయకులు కన్నారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఎటపాక: గన్నవరంలో మేడే వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



చింతూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో...



వై.రామవరంలో మేడే జెండాను ఆవిష్కరిస్తున్న కార్మికులు



మోతుగూడెంలో జెండాను ఎగురవేస్తున్న దృశ్యం





కూనవరంలో జెండా ఎగురవేస్తున్న యూటీఎఫ్ నాయకులు, రేఖపల్లి స్థూపంవద్ద జెండాను ఎగురవేస్తున్న నాయకులు

కగార్‌ని నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరపాలి

● ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు
● ఘనంగా మేడే వేడుకలు

జగ్గంపేట, మే 1(ఆంధ్రజ్యోతి): మేడే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, (ఏపీఆర్‌సీఎస్) అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టీయూ) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జగ్గంపేట శివారురంగవల్లినగర్‌లో ఏపీఆర్‌సీఎస్ జెండాను ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ఆవిష్కరించారు. అనంతరం పుర వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆపరేషన్ కగార్ పేరుతో సాగిస్తున్న మారణ హోమాన్ని తక్షణ నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్పొరేట్లకు అడవిలోని ఖనిజ సంపదను దోచు పెట్టడానికి, అడ్డు వచ్చే ఆదివాసీలను బయటకు వెళ్లగొట్టడానికి కగార్ దాడులు జరుపుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏపీఆర్‌సీఈఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, పీడీఎస్‌యు(వి) రాష్ట్ర నాయకులు దేశెట్టి సురేష్, సోమరాజు, డాన్ శ్రీను, దేవి, నిరీష్ తదితరులు పాల్గొన్నారు. భగత్‌నగర్‌లో సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా నాయకులు ఎం.ఏసు, జి.బాలరాజు ముందుగా మేడే జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ప్రసంగించారు. లేబర్ కోడ్లు కార్మికులను కట్టు బానిసలుగా మారుస్తాయని, లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో స్టాలిన్ భవన్ నుంచి జేవీఆర్ కాంప్లెక్స్ మీదుగా దేవిచౌక్, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఐఎఫ్‌టీయూ జెండాను కారుకొండ శ్రీనివాస్ ఎగురవేశారు. ఐఎఫ్ టీ యూ జాతీయ కమిటీ సభ్యుడు వి.చిట్టిబాబు మేడేను ఉద్దేశించి మాట్లాడారు. అరుణోదయ కళాకారులు డప్పులతో నృత్యాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యులు, ప్రగతి శీల భవన నిర్మాణ కార్మిక సంఘం ఆంధ్ర కమిటీ సభ్యులు మోరుకుర్తి రాజు, కె.శ్రీనువాసు, పెద్దాపురం డివిజన్ కమిటీ సభ్యురాలు కె.లక్ష్మి, కె.బాలు, పీఓడబ్ల్యూ కమిటీ సభ్యురాలు వి.శాంతి, బి.భవానీ, అరుణోదయ కళాకారులు, పల్లాల ధర్మారెడ్డి పాల్గొన్నారు.





ప్రత్తిపాడు లిబరేషన్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న బంగార్రాజు, ఏలేశ్వరంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

ఏలేశ్వరం, (ఆంధ్రజ్యోతి): కలిసి కట్టుగా కార్మికుల హక్కులను కాపాడుకుందామని టీడీపీ పట్టణ అధ్యక్షుడు మూది నారాయణ స్వామి అన్నారు. గురువారం పట్టణంలో లారీ, ఆటో, క్వారీ యూనియన్లు, కార్పెంటర్లు, తాపీమేస్త్రి, ఎలక్ట్రీషన్లు, సంఘాలు, సీఐటీయూ, సీపీఐ(ఎంఎల్) వినోద్ మిశ్రాపార్టీ, తొట్టి రిక్షా యూనియన్ల ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ నేతృత్వంలో ప్యానల్ న్యాయవాదులు బుగతా శివ, అవసరాల దేవి ఆటో యూనియన్ కార్మికులతో కలిసి మేడే పతాకాన్ని ఆవిష్కరించారు. నగర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

గండేపల్లి, (ఆంధ్రజ్యోతి): గండేపల్లిలో గురువారం సీఐటీయూ నాయకులు మేడే వేడుకలు నిర్వహించారు. సీఐటీయూ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి సీఐటీయూ జిల్లా క్యాదర్శి ఎరుబండి చంద్రావతి మే డే పతాకాన్ని ఎగురవేశారు. అలాగే సీఐటీయూ కార్యాలయం వద్ద బిల్డింగ్ కార్మికులు సత్యనారాయణ, చిన్నారావు మేడే జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక నాయకుడు ఎరకరెడ్డి శ్రీనివాస్, అంగన్‌వాడీ నాయకురాలు వైవీ రాజేశ్వరి, పద్మ, మంగతాయారు పాల్గొన్నారు. మల్లేపల్లిలో చెల్లూరి శ్రీను, ఉనమట్ల వెంకటరమణ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి గంగరాజు జెండా ఆవిష్కరించారు. వల్లభశెట్టి సత్తిబాబు, కలవల్ల శ్రీను, అక్కిరెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలంలో గురువారం మేడే వేడుకలు నిర్వహించారు. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు, పోతులూరు, లంపకలోవ గ్రామాల్లో పార్టీ నాయకులు బుగతా బంగార్రాజు, మానుకొండ లచ్చబాబు, మేడిశెట్టి సింహాచలం మేడే జెండాలను ఎగురవేశారు. ప్రత్తిపాడు ఏగులమ్మ గుడి సెంటర్‌లోని లారీ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద గోశాల శ్రీను మేడే జెండాను ఆవిష్కరించారు. సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శులు రొంగల ఈశ్వరరావు, అల్లాడి లక్ష్మి, జి.రమాదేవి, గంజి కామేశ్వరరావు, రాజు, యూటీఎఫ్ నాయకుడు రామలింగేశ్వరరావు పాల్గొన్నారు. ధర్మవరం హనుమాన్ కాలనీ ఆంజనేయస్వామి గుడి సమీపంలో మేడే జెండాను ఆవిష్కరించారు.

రౌతులపూడి, (ఆంధ్రజ్యోతి): కార్మికుల పని గంటలు తగ్గించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు ఆకుల సత్యనారాయణ, అంగన్‌వాడీ సంఘం నాయకులు రాజేశ్వరి డిమాండ్ చేశారు. ఎంఈవో కార్యాలయంలో గురువారం ప్రపంచ మేడే దినోత్సవం నిర్వహించారు. సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. కార్య క్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గంగా సూరిబాబు, కోటిపల్లి నాగేశ్వరరావు, వైసత్యనా రాయణ, బేన్నయ్యమ్మ, సత్యవాణి, రమణ తదితరులు పాల్గొన్నారు.

తొండంగి, (ఆంధ్రజ్యోతి): మే డే వేడుకలను గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఏ.కొత్తపల్లిలో సత్యదేవా భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో మేడే పతాకాన్ని ఆవిష్కరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి శివకోటి రాజు మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అంబుజాలపు నాగేశ్వరరావు, కాలిబోయిన శ్రీను, నరాల లవరాజు, నాగేశ్వరరావు, తలపంటి రమణ, వెలుగుల బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి రూ.5కోట్లు

ఏలేశ్వరం, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5కోట్లు నిధులు ఖర్చు చేసినట్టు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో రోడ్లు పనులు చేపట్టక పోవడంతో గుంతుల, గోతులతో ప్రజలు అవస్థలు పడ్డారన్నారు. పెద్దనాపల్లి నుంచి చిన్నింపేట, కొండ తిమ్మాపురం నుంచి లింగంపర్తి, తిరుమాలి మెయిన్ రోడ్డు నుంచి తిరుమాలి గ్రామం వరకు రహదారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. జె.పెదబాబు, సుబ్బరాజు, బస్వా ప్రసాద్, చిక్కాల లక్ష్మణరావు, జిగటాపు సూరిబాబు, నూకతాటి ఈశ్వరుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శంఖవరం, మే 1(ఆంధ్రజ్యోతి): శంఖవరంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ బి.వీరభద్రరావు తెలిపారు. కొత్త స్తంభాలు ఏర్పాటు నేపథ్యంలో ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

జగ్గంపేట, (ఆంధ్రజ్యోతి): శుక్రవారం 11కేవీ రాజపూడి ఇండస్ట్రీయల్, 11కేవీ జె.కొత్తూరు ఫీడర్‌లో మరమ్మతులు, ట్రీకటింగ్ కారణంగా ఉదయం 7నుంచి 12గంటల వరకు గుర్రప్పాలెం, గొల్లలగుంట, మన్యంవారిపాలెం, బలభద్రపురం గ్రామాలకు, బావవరం వాటర్ ప్లాంట్‌కు సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు విద్యుత్ ఈఈ వీరభద్రరావు తెలిపారు.

చిన్నారులకు అన్నదానం

ప్రత్తిపాడు, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు అనాధ శరణాలయంలో చిన్నారులు, వృద్ధులకు గురువారం డాక్టర్ రితీష్ పాల్ చవల ఫౌండేషన్ నిర్వాహకులు, మినర్వా ప్రిన్సిపాల్ చవల ఆనందజోష్‌కుమార్, మెర్సీ స్వర్ణ దంపతులు అన్నదానం నిర్వహించారు. వారి తనయుడు డాక్టర్ పాల్ చవల మూడో వర్ధంతి సందర్భంగా ఈకార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చవల తేజ్‌కమల్, వర్షిత, కనికళ్ళ కిషికిల్లా, జోసెఫ్, చీకురుమల్లి రమేష్, రీతు, బోమిడి సురేష్, సత్యశీల, దయానందరాజ్, మేరీ గ్రేష్, సంజన, ఏంజిల్‌కా, రిబకా, హేనా, జాన్ ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడిగా సత్తిబాబు ప్రమాణ స్వీకారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతులనెహ్రూ

జగ్గంపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): ధార్మిక సేవలందించడంలో, సామాజిక సేవలందించడంలో ఆర్యవైశ్యులు ముందుంటారని అటువంటి సంఘానికి జిల్లా అధ్యక్షుడిగా బత్తుల సత్తిబాబును ఎన్నుకోవడం ఎంతో శుభ పరిణామమని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గోకవరం మండలం కృష్ణునిపాలెం గోపికృష్ణ ఫంక్షన్ హాల్‌లో బుధవారం తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా టీడీపీ నాయకుడు బత్తుల సత్తిబాబు ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, గుడా మాజీ ఛైర్మన్ గన్ని కృష్ణ హాజరయ్యారు. వివిధ జిల్లాల నుంచి ఆర్యవైశ్య ప్రముఖులు నడుమ ఆర్యవైశ్య కుటుంబ సభ్యుల సమక్షంలో సత్తిబాబుతో పాటు ఇతర కమిటీల సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య రాష్ట్ర జిల్లా నాయకులు, ప్రముఖులు, గోకవరం ఆర్యవైశ్యసంఘ సభ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థికి కలెక్టరు అభినందన

శంఖవరం, మే 1(ఆంధ్రజ్యోతి) పది ఫలితాల్లో ఎద్దు బాలమురళీ 584 మార్కులతో మండల టాపర్‌గా నిలిచాడు. గురువారం కలెక్టరు కార్యాలయంలో మురళీని కలెక్టరు షాన్ మోహన్ అతడ్ని అభినందించి, శాలువాతో సత్కరించి పుస్తకం, నగదు బహుమతిని అందించినట్లు ఆదర్శ పాఠశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ వైఎస్‌వీ కిరణ్ తెలిపారు. ఉన్నతశిఖరాలను అధిరోహించాలని డీఈవో పి.రమేష్ ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమానికి విద్యార్థి తల్లిదండ్రులతో పాటూ తోట సీతారామయ్య తదితరులు హాజరయ్యారు.

కేజీపీఎల్ భూములు పరిశీలించిన జేసీ

తొండంగి, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్ మీనా కేజీపీఎల్ పోర్టు భూములను గురువారం పరిశీలించారు. పోర్టు కోసం తీసుకున్న భూములకు సంబంధించి ఇంకా 597ఎకరాలకు సంబంధించి 785మంది రైతులు పరిహారం పొందలేదు. ఈభూముల్లో ఉన్న ఇసుకను తాము వినియోగించుకుంటామంటూ రైతులు తరచూ రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగుతున్న నేపథ్యంలో జేసీ అక్కడి భూములను పరిశీలించి రైతులతో సమావేశమయ్యారు. పరిహారం పెంచాలని రైతులు డిమాండ్ చేశారు. తమ భూముల్లో ఇసుక తవ్వకాలకు అనుమతించాలని కోరారు. రైతుల డిమాండ్లను తెలిపి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. టీడీపీ నేత యనమల రాజేష్, ఆర్డీవో శ్రీరమణి, తహశీల్దార్ మురార్జీ, ఆర్ఐ రాజారావు రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు

తొండంగి, మే 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఏ.కొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని తొగరు పావని షణ్ముఖి 588 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. గురువారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో షణ్ముఖిని కలెక్టర్ అభినందించి రూ.పది వేలు పురస్కారాన్ని, చైతన్యం కలిగించే పుస్తకాన్ని బహూకరించారు. విద్యార్థిని తల్లిదండ్రులను శాలువాతా సత్కరించి అభినందించారు. ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ మాణిక్యం పాల్గొన్నారు.

సుఖ, సంతోషాలతో ఉండాలి

కిర్లంపూడి, మే1(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. కిర్లంపూడిలోని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి దేవాలయంలో అష్టోత్తర శత (108) కుంభాభిషేకాన్ని ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. ప్రధాన అర్చకులు గోవర్ధన శ్రీధర్ ఆచార్యులు, ఆలయ ట్రస్టీ వెంకటరాజాగోపాల రామకృష్ణప్రసాద్ బహదూర్, గ్రామస్తులు ఆధ్వర్యంలో నిర్వహించారు. వేణుగోపాల స్వామిని గిరిబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పెంటకోట నాగబాబు, గొల్లపల్లి కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శంకరజయంతి పురస్కరించుకుని అన్నవరంలో ప్రత్యేక కార్యక్రమాలు

అన్నవరం, మే 1(ఆంధ్రజ్యోతి): శంకరజయంతి పురస్కరించుకుని గురువారం గ్రామంలో బ్రాహ్మణసంఘం, హిందూబంధువులతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అన్నవరం దేవస్థానం వ్రత పురోహిత సంఘం అధ్యక్షుడు చామర్తి కన్నబాబు తెలిపారు.ఉదయం సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో శంకరాచార్యులకు అభిషే కం, మధ్యాహ్నం విశేష అన్నదానం చేపట్టి సాయంత్రం 4గంటల నుంచి సాక్షి గణపతి ఆలయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా వాసవీమాత ఆలయం వరకు కంచిపీఠం ఉత్తరాధికారిగా బాధ్యతలు స్వీకరించిన సత్య చంద్రశేఖరేంద్ర స్వామికి అభినందనలు తెలుపుతూ ప్రత్యేకర్యాలీ చేపట్టనున్నామన్నారు. స్వామీజీఫ్లెక్సీలుఏర్పాటు చేశారు.

నూతన పింఛన్లు పంపిణీ

ఏలేశ్వరం, మే1(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో నూతనంగా మంజూరైన పించన్లను ఛైర్‌పర్సన్ అలమండ సత్యవతి గురువారం పంపిణీ చేశారు. భర్త కాలం చేసిన కొద్ది రోజుల వ్యవధిలోనే భార్యకు పింఛన్ అందిస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందన్నారు. వృద్ధులు, వికలాంగుల ఇంటికి సచివాలయ సిబ్బంది వెళ్లి పింఛన్లు అందించారు.

డ్రైవర్ నారాయణకు సన్మానం

ఏలేశ్వరం, మే 1(ఆంధ్రజ్యోతి): ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో డ్రైవర్ నారాయణ దంపతులను ఘనంగా సత్కరించారు. గురువారం ఆర్టీసీ గ్యారేజ్‌లో ఎంప్లాయిస్ యూనియన్ సభ్యుడు కృష్ణ అధ్యక్షతన ఆర్టీసీ డ్రైవర్‌గా ఉద్యోగ విరమణ చేస్తున్న జి.ఎస్.నారాయణ దంపతులకు పూలమాలలు వేసి, శాలువా కప్పి సత్కరించారు. డ్రైవర్‌గా అంకిత భావంతో పనిచేస్తూ అనేక అవార్డులు పొందారని డిపో కార్యదర్శి యూ.బి.ఎం.కుమార్ కొనియాడారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జీవీఎస్ నారాయణ, ఏవీఎస్ నారా యణ, త్రిమూర్తులు, బి.ఎస్‌బాబు, అమ్ము లు, మాణిక్యం, అనురాధ, నల్లయ్య పాల్గొన్నారు.

ఏలూరు జిల్లా విజిలెన్స్ అధికారిగా ఎంపీడీవో బుజ్జి



గండేపల్లి, మే1 (ఆంధ్రజ్యోతి): గండేపల్లి ఎంపీడీవో నాతి బుజ్జి ఏలూరు జిల్లా విజిలెన్స్ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఆమె ఏడు నెలలు ఎంపీడీవోగా విధులు నిర్వహించారు. మండలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయం రూపురేఖలు మార్చారు. విజిలెన్స్ అధికారిగా వెళ్లడంపై పలువురు నాయకులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్సీ బొత్సను కలిసిన ముదునూరి

ప్రత్తిపాడు, మే 1 (ఆంధ్రజ్యోతి): నర్సాపురం పార్లమెంటరీ వైసీపీ పరిశీలకుడిగా నియమితులైన ధర్మవరం ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు గురువారం మాజీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖపట్నం పార్టీ కార్యాలయంలో బొత్సను సన్మానించారు. తునిలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజాను కూడా ముదునూరి సన్మానించారు. ధర్మవరం నాయకులు కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం ప్రారంభం

శంఖవరం, మే 1 (ఆంధ్రజ్యోతి): శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామి వారి ఆలయ ఆవరణలో దాత గాబు గంగాధరరావు ఆధ్వర్యంలో నిర్మించిన కల్యాణ మండపాన్ని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో పలు నియోజకవర్గాల నేతలు, గ్రామ ప్రజలు అధికసంఖ్యలో హాజరయ్యారు. ఉదయం నుంచి విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల కల్యాణం ఘనంగా నిర్వహించారు.

విద్యార్థులకు నగదు అందజేత

రౌతులపూడి,మే1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో టాపర్‌గా నిలిచి విద్యార్థులకు కలెక్టర్ షాన్ మోహన్ పది వేలు నగదు అందజేశారు. రౌతులపూడి, మూలగపూడి జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన గాది విజయలక్ష్మి, గాడి లావణ్య, కర్రి యశ్వంత్‌లకు తల్లిదండ్రులు చేతులుమీదుగా నగదు, మోటివేషన్‌బుక్ అందేజేసి సత్కరించారు.

సారాతో వ్యక్తి అరెస్టు


దేవీపట్నం, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలో చిన్న బియ్యంపల్లి గ్రామ సమీపంలో అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ తెలిపారు. గురువారం సారా బట్టీలపై దాడులు నిర్వహించగా 15 లీటర్ల సారాను ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరుస్తామన్నారు.


మండలంలో పెన్షన్లు పంపిణీ

దేవీపట్నం, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలో దేవీపట్నం, ముంటూరు, కొండమొదలు, వి.రామన్నపాలెం, దేవారం, ఇందుకూరు, ఇందుకూరుపేట తదితర గ్రామాల్లో 95 శాతం పెన్షన్ల పంపిణీ జరిగినట్లు ఎంపీడీవో రత్నకుమారి తెలిపారు. 4300 పెన్షన్లు ఉండగా 4 వేల మందికి పింఛన్లు సచివాలయ సిబ్బందితో పంపిణీ చేసినట్లు వివరించారు.

గిరిజనుల అభివృద్ధిపై దృష్టి సారించాలి

● రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్





సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్, జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న నాయక్

రంపచోడవరం, మే 1 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధికి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది దృష్టి సారించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్ అన్నారు. గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారులు కట్టా సింహాచలం, అపూర్వ భారత్, డీఎఫ్‌వో రవీంద్ర ధామలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎం నాయక్ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ విభాగం ద్వారా ఫేజ్-1, ఫేజ్-2లో మంజూరైన పనుల పురోగతిపై సమీక్షించారు. 108, ఐటీడీఏ, ఫీడర్ అంబు లెన్సుల ద్వారా మారుమూల గ్రామాల్లో మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రులలో డెలివరీలు, గర్భిణులకు రక్తహీనత లేమీలు లేకుండా చేపట్టిన చర్యలపై ఆరా తీశారు. ఏజెన్సీలో అంగన్వాడీ, మల్టీపర్పస్ భవనాల వివరాలు సమర్పించాలన్నారు. జన్మ పథకం ద్వారా ఏజెన్సీలో మంజూరైన గృహాలు, ఇంకా పూర్తి కావాల్సిన గృహాల నిర్మాణాలపై సమీక్షించారు. ఏజెన్సీలో 1/70 చట్టాన్ని అమలుచేసే బాధ్యత అధికారులపై ఉంద న్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు రుక్మాండయ్య, షరీఫ్, ఏపీవో(జీ), డీవీస్వీ రమణ, ఏడీ ఎంహెచ్‌వో జి.శిరీష, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, రవికుమార్, పీహెచ్‌వో చిట్టిబాబు, జీసీసీ డీఎం జి.పార్వతీశ్వరరావు, ఏపీడీ దేగలయ్య, సీడీపీవో సంధ్యారాణి, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

జీడిపిక్కల ప్రాసెసింగ్ పరికరాలు ఏర్పాటు చేయాలి

ఏజెన్సీలో వందన్ వికాస కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన జీడిపిక్కల ప్రాసెసింగ్‌కు కావలసిన పరికరాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఐటీడీఏ పీవో కట్టా సింహాచలంతో కలిసి పందిరిమామిడి కృషివిజ్ఞాన కేంద్రం, ఇర్లపల్లిలోని జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయక్ మాట్లాడుతూ వందన్ వికాస కేంద్రాల అభివృద్ధికి బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలన్నారు. వందన్ వికాస కేంద్రాల సభ్యులకు జీడిపిక్కల ప్రాసెసింగ్ పై అవగాహన కల్పించాలన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, డీఈఈ చైతన్య, డీపీఎం పరమేశ్వరరావు, ఎం.ఉదయ శ్రీనివాసరావు పాల్గొన్నారు.